# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట




నిరసన సభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

### గాంధీ పేరు తొలగిస్తే

## మరో ఉద్యమం

**రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి**

**అమరచింత జనవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో బడుగు బలహీన వర్గాలకు ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరుతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, వాకిటి శ్రీహరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరు తొలగించడాన్ని ఏఐసీసీ పిలుపులో భాగంగా బుధవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, దేశం కోసం శాంతియుతంగా ఉద్యమం చేసి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ నీ ప్రపంచ దేశాలు పూజిస్తుంటే మనదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆయన అన్నారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రచించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడానికి పూనుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ స్వరాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు మహాత్మా గాంధీ పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్లు శ్యాం కుమార్, విష్ణు, కమలాకర్ గౌడ్, దేవరకొండ మోహన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, హనుమంతు నాయక్, ప్రకాశం, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్, అల్తాఫ్, తౌఫిక్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన మల్టీ పర్పస్ షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

### దేవాలయంలో మెరుగైన

## వసతులు కల్పిస్తాం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నగరంలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా, ముడా నిధులు రూ.20లక్షలతో ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మల్టీ పర్పస్ షెడ్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తన యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకుని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ దేవాలయంలో మెరుగైన వసతులు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ షెడ్ ఏర్పాటుతో ఇక్కడ జరిగే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిలో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు రూ.1400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేస్తూ ఈ పనుల ద్వారా – మిగతా4లో..



44వ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

## ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యం

**జాతీయ రహదారిపై ఎస్పీ ఆకస్మిక తనిఖీలు**

**నివారణకు బ్లాక్ స్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**44వ జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలపై ప్రత్యేక దృష్టి**

**జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాలు**

**వనపర్తి,జనవరి 21 ప్రభాతవార్త :**రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని, అప్పుడే రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ పోలీస్‌శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దమందడి, కొత్తకోట, పెబ్బేరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురయ్యే – మిగతా4లో..

## విధులపై డీఈఓ నిర్లక్ష్యం

**ఇష్టారీతిగా అనుమతులు, విధులు**

**చర్యలు తీసుకోవాలని ఆర్జెడీకి వినతి**



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**మహబూబ్‌నగర్,జనవరి 21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ డిఈఓ ఇష్టారీతిగా విధులు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడికి వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి పర్యటనకు వచ్చిన ఆర్జెడి సోమిరెడ్డికి,జిల్లావిద్యా కార్యాలయంలో నెలకొన్న అవ్యవస్థలు, అవినీతి, నిర్లక్ష్యంపై వినతిపత్రం అందజేశారు. జిల్లా డీఈవో ప్రవీణ్ కుమార్ విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆఫీస్‌లో ప్రజలను సరిగా కలవకపోవడం, సమయానికి అందుబాటులో లేకపోవడం,వివిధఅక్రమాలకు ఒత్తాసు పలకడం ద్వారా, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని నిరక్ష్యం చేస్తున్నారని ఆక్షేపించారు. అలాగే గత 67 నెలల నుండి డీఈవోకు – మిగతా4లో..

## పులుల లెక్క.. పక్కా..





- ఆరు రోజులు 712 మంది అధికారులు, వాలంటీర్లు
- మరో నాలుగు రోజుల పాటు వన్యప్రాణుల గణన
- ఈ నెల 25 వరకు సఫారీ సేవలు నిలిపివేత
- ఇప్పటికే 50 పులుల నమోదు
- దేశంలోనే రెండో అతిపెద్ద టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అమ్రాబాద్ (ఏటిఆర్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాతవార్త :** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో మరోసారి పులుల లెక్క తేల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. నాలుగు రోజులపాటు జరగనున్న వన్యప్రాణుల గణన ఈనెల 25తో ముగియనున్నది. ఈమేరకు 712 మంది అధికార యంత్రాంగం తో పాటు వాలంటీర్లు చెంచులు కూడా పనుల గణనలో పాల్గొననుండడం విశేషం. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. గత నాలుగు సంవత్సరాలుగా, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ( ఏటిఆర్) బలమైన పరిరక్షణ ఫలితాలు, పారదర్శక సందర్శకుల అనుభవంతో వృత్తిపరంగా నిర్వహించబడే వన్యప్రాణుల గమ్యస్థానంగా అభివృద్ధి చెందింది. అక్టోబర్ 2025 ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు రిజర్వ్ దాదాపు 50 పులుల వీక్షణలను నమోదు చేసింది. ఇది మెరుగైన నివాస ఆరోగ్యం, రక్షణను ప్రతిబింబిస్తుంది. సందర్శకులు జంగిల్ సఫారీ యొక్క మూడు లీనమయ్యే సర్యూట్ల ద్వారా ఈ వన్యప్రాణుల సంపదను –మిగతా4లో..



వాలంటీర్లు

## మహిళా సర్పంచులు స్వతంత్రంగా పనిచేయాలి

**గ్రామ బడ్జెట్‌ను సమర్థంగా నిర్వహించాలి**

**ప్రతి రెండు నెలలకు**

**ఒకసారి గ్రామసభ నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాతవార్త:** మహిళా సర్పంచులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, గ్రామ బడ్జెట్‌ను పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం బండమిదిపల్లి దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ సర్పంచ్‌ల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచులకు ఉద్దేశించి అన్నారు. మహమ్మదాబాద్, గండీడ్, హాన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్ మండలాలకు చెందిన నూతన సర్పంచులకు జనవరి 19 నుంచి 23 వరకు మొదటివిడత శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. సర్పంచుల విధులు, బాధ్యతలపై కలెక్టర్ వివరంగా చర్చిస్తూ, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని గ్రామాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన పొందాలని సూచించారు. ఈ శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టం-1993, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్పంచులకు కల్పించిన అధికారాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అందుకే సర్పంచులకు అందించిన మార్గదర్శక పుస్తకం, నియమావళిని తప్పనిసరిగా చదివి చట్టాలు, నిబంధనలు, విధానాలపై స్పష్టత తెచ్చుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలో గ్రామ సభ అత్యంత ముఖ్యమైన వ్యవస్థ అని పేర్కొంటూ, ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించాలన్నారు. గ్రామ సభల్లో –మిగతా4లో..



హాజరైన సర్పంచులు



హాజరైన సర్పంచులు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలి

**ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**డిమాండ్, సరఫరా నివేదిక అందజేయాలి**

**ఫిబ్రవరి 1 నాటికి సమస్యలు గుర్తించాలి**

**మిషన్ భగీరథ అధికారులకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాతవార్త:** రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని అన్ని మండలాల గ్రామాలు, హాబిటేషన్లకు మిషన్ భగీరథ ద్వారా అందుతున్న తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా తాగునీటి డిమాండ్-సరఫరా వివరాలు, ఎదురవుతున్న సమస్యలపై నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ మరమ్మతులు, పంప్‌సెట్‌ల పనితీరు, ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతులు, టెయిల్ ఎండ్ హాబిటేషన్లలో అవసరమైతే స్థానిక బోరు బావుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ నాటికి ప్రతి గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి – మిగతా4లో..



ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు బైకుపై వెళ్తున్న మంత్రి

### మున్సిపాలిటీల అభివృద్ధి ధ్యేయంగా

## ముందుకు సాగుతా

**మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆదరించండి**

**రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, వాకిటి శ్రీహరి**

**అమరచింత జనవరి 21, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం లోని మక్తల్, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల అభివృద్ధి ధ్యేముగా ముందుకు సాగుతానని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని 10 వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలకు 16 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజ్ గౌడ్‌తో కలిసి భూమి పూజ నిర్వహించారు. అలాగే రాష్ట్రమంత్రి,వాకిటి శ్రీహరి ఆయ వార్డులలో బైకుపై కలిసితిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుల నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మంత్రి పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన లబ్ధిదారులను కోరారు. అలాగే పట్టణంలోని చేనేత మొగ్గాలను పరిశీలించి చేనేత కార్మికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని త్వరలో చేనేత కార్మికులకు – మిగతా4లో..

## అధికారులు రహదారి భద్రతపై ప్రజలకు ఆదర్శంగా నిలవాలి

**గద్వాల జనవరి 21, ప్రభాతవార్త:** అధికారులు రోడ్డు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ రహదారి భద్రత విషయంలో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన చేరుకోండి(ఎరైవ్), జీవించండి(ఆలైవ్) అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ మాట్లాడుతూ అధికారులు ప్రతి నిత్యం తమ కార్యాలయాలకు ద్విచక్ర వాహనాలు, కార్లలో వస్తుంటారు కాబట్టి తాము తప్పకుండా రహదారి నియమాలను పాటించాలన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ రహదారులు నిర్మించేటప్పుడు నాణ్యతతో పాటు, రోడ్డు భద్రత ఉండేలా డిజైన్ చేసే విషయంలో అధికారులు నిబంధనలను పాటించాలని,



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

అలాంటప్పుడే వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా చూడవచ్చు అన్నారు. తానుహైదరాబాదులో ఔటర్‌రింగ్ రోడ్డు ఎండీగా పనిచేసిన సమయంలో అక్కడ జరిగిన ప్రమాదాలకు కారణాలను విశ్లేషించడం జరిగిందని, స్పీడ్ లిమిట్ ఒక రకంగా డిజైన్ చేసి ఉంటే వాహనదారులు అధిక వేగంతో పోవడం, అకస్మాత్తుగా రహదారులపై వాహనాలను నిలపడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. కర్నూల్ జిల్లాలో గతే దాది జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మృత్యువాత పడడం, ఇతర సంఘటనలను దృష్టిలో ఉంచుకొని డ్రైవర్లు ఎంతో బాధ్యతాయుతంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయాల్సి ఉందన్నారు. ప్రమాదాల కారణంగా ఆయావ్యక్తుల నుంచి రావాల్సిన వస్తు ఉత్పత్తి తగ్గిపోతుందని, ఫలితంగా దేశ జిడిపిపై దాని ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

### రహదారులపై భద్రత పాటించాలి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతుండడం ప్రస్తుతం సర్వసాధారణమైందని, ఈ పరిస్థితుల్లో మార్పురావాలంటే ప్రతిఒక్కరూ రహదారి భద్రతపై అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే సంబంధిత రవాణాశాఖ, ట్రాఫిక్, పోలీస్‌అధికారులు కఠినంగా వ్యవహరించాలని అప్పుడే ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటిస్తారన్నారు. కొన్ని దేశాల్లో రహదారి భద్రతపై ప్రజలకు మంచి అవగాహన ఉందని, మన వద్ద కూడా ప్రమాదాల నివారణకు ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు.

### రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్పీ

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరుల బాధ్యతాయుతమైన ప్రవర్తనతోనే రహదారి ప్రమాదాలను నివారించవచ్చని, రోడ్డు భద్రత ప్రతి కుటుంబానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఇంటి యజమాని, పిల్లలు, జీవిత భాగస్వామి అనుకోని ప్రమాదాలతో మృతిచెందితే ఆయా కుటుంబాలు అనుభవించే ఆర్థిక, మానసిక వేదనను పూడ్చడం చాలా కష్టమన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో పనిచేసే ఉద్యోగులు ద్విచక్ర వాహనంపై వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనంపై మహిళలను, చిన్నారులను ఎక్కించుకునీ నడిపేటప్పుడు వారిని గమ్యస్థానాలకు సురక్షి తంగా చేర్చే విషయంపై జాగ్రత్తలు పాటించాల్సి ఉందన్నారు. ప్రమాదాల బారిన పడిన – మిగతా4లో..

## ఉపాధి హామీ పథకానికి

# గాంధీ పేరు మార్చవద్దు అని ధర్నా

**ఖిల్లా గణపురం జనవరి 21. ప్రభాతవార్త:** గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు మార్చవద్దని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామాలలో నిరుపేదలు కూలీ పనులు చేసే వారి కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనే పేరుతో పనులు చేపట్టిందని దీనిని జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గాంధీ పేరును తొలగించాలని చూస్తోందని ఇలాంటి వాటికి మేము వ్యతిరేకమని ఒకవేళ గాంధీ పేరును తొలగిస్తే జాతీయస్థాయిలో ధర్నాలు చేస్తామని వారు తెలిపారు. బిజెపి ప్రభుత్వం దేశానికి స్వతంత్రాన్ని తీసుకువచ్చిన గాంధీ పేరును తొలగించే విషయంలో వెంబడే విరమించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ జెడ్పిటిసి విజయ్ కుమార్, డాక్టర్ నరేందర్ గౌడ్, ముడావత్ గోవింద్, గంజాయి రమేష్, మునగాళ్ల బాబు, ఆగారం ప్రకాష్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని జెండా ఆవిష్కరణ

**అలంపూర్ జనవరి 21, ప్రభాతవార్త :** మహిళ సమస్యలు పరిష్కరించడం కోసం మహిళా సంఘం ఏర్పాటు అయిన నాటినుండి నేటి వరకు పోరాటాల ఫలితంగా అనేక మార్కులను సాధించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెలమ్మ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లాకార్యదర్శి ఏ.నర్మద మాట్లాడుతూ, మహిళా సమస్యలను పరిష్కరించడం కోసం మహిళా సంఘం ఏర్పడిన నాటి నుండి నేటివరకు పోరాటాల ఫలితంగా అనేక హక్కులను సాధించుకున్నదని ఈ సందర్భంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దు చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెలమ్మ మాట్లాడుతూ, ఈ నెల 25వ తారీకున హైదరాబాదులో ఐద్వా 14 వ జాతీయ మహాసభలు జరుగుతున్నాయని ఈ సభల్లో మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దేవమ్మ, నాయకులు కాంతమ్మ, మదనమ్మ, లక్షి ్మ, పార్వతమ్మ, ఎసమ్మ, బుజ్జమ్మ, మరియమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ చేస్తున్న ఏమైలమ్మ

# పేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

**అడ్డాకుల, జనవరి 21 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండలం పరిధిలోని బలీదు పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మహేష్ తండ్రి కుమ్మరి విష్ణు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు చెక్కును వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నాడు గ్రామ సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారునికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఏదో ఒక రూపంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి ఉపసర్పంచ్ రాధా శివ, మాజీ ఎంపీటీసీ వెంకట్రాంరెడ్డి, వార్డు సభ్యులు మందకృష్ణయ్య, వై.ఆంజనేయులు, రాములు, మంగరాయి,భార్గవి వెంకటేష్, జి.మన్యపురెడ్డి,కోట్ల వెంకటరెడ్డి, కందూర్ వెంకట్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకటేష్, శ్రీశైలం, శంకర్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

# డిఆర్డిఓ ఆకస్మిక తనిఖీ

## నర్సరీ నిర్వహణపై అసంతృప్తి

**ఉప్పునుంతల, జనవరి 21 ప్రభాతవార్త :** మండలంలోని దేవదారికుంట తాండ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామనర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌లను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చిన్న ఓబులేసు బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, అవెన్యూ ప్లాంటేషన్‌లకు అవసరమైన నీటి సరఫరా వ్యవస్థపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్‌ల నిర్వహణతో పాటు నిధుల మంజూరు పై సమగ్ర అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హరితహారం కార్యక్రమంలో సర్పంచుల బాధ్యతలను స్పష్టంగా తెలియజేయాలని మండల ఎపిఓ పర్వతాలకు హెచ్చరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నర్సరీల నిర్వహణకు మంజూరు చేస్తున్న నిధుల వినియోగం, వాటి పర్యవేక్షణపై సర్పంచులకు స్పష్టమైన అవగాహన ఉండాలని, నిధులు సద్వినియోగం కావాల్సిన బాధ్యత పూర్తిగా సంబంధిత శాఖలపై ఉందని ఆయన అన్నారు. గ్రామ నర్సరీలు, రెవెన్యూ ప్లాంటేషన్‌ల నిర్వహణ ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ పర్వతాలు, టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం, పంచాయతీ కార్యదర్శి చందర్ లాల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రతన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దేవదారి కుంట తండాలో నర్సరీని పరిశీలిస్తున్న డిఆర్డిఓ ఓబులేష్

# చలికాలం వరి సాగులో జాగ్రత్తలు అవసరం

**మద్దూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్**

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త :** చలికాలంలో వరి సాగు చేస్తున్న రైతులు నాట్ల అనంతరం పంట మంచి పెరుగుదల సాధించేందుకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని మద్దూరు మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ సూచించారు. నాట్లు చేసిన 3నుంచి 4రోజుల తర్వాత పొలంలో 2 నుండి 3 సెం.మీ. నీరు మాత్రమే నిల్వ ఉంచాలని 7 నుంచి 10 రోజుల తర్వాత సిఫారసు చేసిన మోతాదులో యూరియా వినియోగించాలని తెలిపారు. చలికాలంలో జింక్ వంటి సూక్ష్మ పోషక లోపాలు వచ్చే అవకాశం ఉందని, లక్షణాలు కనిపిస్తే తగిన ఎరువులు వినియోగించాలన్నారు. నాట్లు వేసిన 15 నుండి 20 రోజులలో కలుపు నివారణ చేపట్టాలని, ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, బ్రౌన్ ప్లాంట్ హాపర్ వంటి పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసరంగా మందులు పిచికారీ చేయకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు.రైతులు సమతుల్య పోషక యాజమాన్యం పాటించి చలికాల వరి పంటలో మంచి దిగుబడులు సాధించాలని ఆయన కోరారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి చికిత్సకు సూచించగా, మరో 15 మందికి తక్షణ చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఆప్తామిస్టులు సుష్మిత, ఆనంద్, నర్సులు సుఖ్‌వీర్, మేఘన, సూపర్‌వైజర్ రాధా శ్యామ్, నారాయణపేట జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షురాలు రాధా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్తాలమిస్టు సుష్మిత మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.



ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

# అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

**గంట దేవాలయం నుండి కలశాలు ఊరేగింపు**

**అమ్మవారి నిజరూప దర్శనం వేలాది మంది భక్తులు వీక్షించడం జరుగుతుంది**

**శక్తి పీఠాన్ని మీడియా ప్రపంచవ్యాప్తంగా తీసుకువెళ్లాలి**




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జోగులాంబ సేవ సమితి అధ్యక్షులు

**అలంపూర్ జనవరి 21, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ లోని జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో ఈనెల 19 నుంచి 23 తేదీ వరకు జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజు అయినా 23వ తేదీన వసంత పంచమి రోజు జరిగే అమ్మవారి నిజస్వరూప దర్శనం రోజు జరిగే జోగులాంబ జాతర ఘనంగా నిర్వహించేందుకు జోగులాంబ సేవాసమితి అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం అలంపూర్ లోని తెలంగాణ హరిత టూరిజములో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,గత 18ఏళ్ల క్రితం బోరింగ్ శ్రీను అనే భక్తుడు మొదటిగా ఐదు కలశాలతో వసంత పంచమి రోజున తన ఇంటి నుండి ఊరేగింపుగా జోగులాంబ అమ్మవారికి అభిషేక కార్యక్రమం మొదలు పెట్టాడని తర్వాతి కాలంలో అవి పదులు వందలు దాటి నేడు వేలాది సంఖ్యలో అల్లంపూర్ పట్టణమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలు దూర ప్రాంతం ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటూ ఈ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నామని అంతేనా ఈ సారి కూడా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులతో వితరూపాల్లో అలంకరించుకొని దారి పొడుగునా కోలాటాల కళాకారులతో కలిసి గాంధీ చౌక్ నుండి మహిళలు కలశాలు నెత్తిన ధరించి ఊరేగింపుగా అమ్మవారి అభిషేక కార్యక్రమంలో పాల్గొంటారని,ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా భక్తులకు చేరే విధంగా చూడాలని మీడియా మిత్రులకు విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థులను ఆదరించండి

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కే సూర్యం**

**అమరచింత జనవరి 21,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన ఉండి పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని సిపిఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, కే సూర్యం ప్రజలను కోరారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసిన అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా గత 40 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామని ఆయన అన్నారు. అమరచింత మున్సిపల్ ఎన్నికలలో సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి అనుమంతు, ప్రసాద్, సి రాజు, కే రాజన్న, మసలమని, కురుమన్న, ప్రేమ రత్నం, భక్తరాజు, రామచంద్రజి, సత్యనారాయణ, జిలాని, ఆనంద్, బి విజయ్, అబ్రహం, గణేష్, తాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి వర్గ సభ్యులు కే సూర్యం

# వార్డుల వారీగా సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరిద్దాం

**ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు**

**ఉప్పునుంతల, జనవరి 21 ప్రభాతవార్త :** గ్రామంలో వార్డు సభ్యులు సమస్యలను వార్డుల వారీగా గుర్తిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గతంలో చేయని పనులను, భవిష్యత్తులో చేయబోయే పనుల పట్ల వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ సహకారంతో గుర్తిస్తే సత్వరమే పరిష్కరించేందుకు సుగమంగా ఉంటుందని అన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం జరిగిందని, ఇంకా పెండింగ్ లో ఉన్న కాలనీలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శి కి గ్రామ సర్పంచ్ సూచించారు. గ్రామంలో ఏ వాడికి వెళ్ళినా గ్రామ వార్డు సభ్యుల సహకారం తీసుకోవాలని సర్పంచ్ ఆదేశించారు. సాధారణ సమావేశంలో కొన్ని కాలనీలో సమస్యలు ఉన్నట్లు వారు సమావేశంలో వార్డు సభ్యులు సూచించారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుద్ధం తో పాటు తాగునీరు, వీధి దీపాలు, గ్రంథాలయం, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణం పట్ల సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు

# దేవరకద్ర మున్సిపల్ భవనానికి నిధులు మంజూరు

**రాష్ట్ర ముఖ్యమంత్రికి దేవరకద్ర ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు**

**దేవరకద్ర,జనవరి 21 ప్రభాతవార్త:** సేవా దృక్పథం కలిగిన మంచి నేత దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అని దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఓవైపు ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో మచ్చలేని నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని దేవరకద్ర మున్సిపాలిటీ నాయకులు కొనియాడారు. ఈ మేరకు దేవరకద్ర మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తూ, మున్సిపల్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జీవో జారీ చేశారు. గతవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మున్సిపల్ భవనంకు నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం పరితపిస్తూ ఇంతవరకు 28 కోట్ల నిధులను మంజూరు చేయించి,మళ్లీ ఇప్పుడు తాజాగా మున్సిపాలిటీ భవనానికి ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలపై అవగాహన : ఎస్సై

**శ్రీరంగాపూర్, జనవరి 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగపూర్ ఎస్సై హిమబిందు మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ బైకు నడిపేవారు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించి మద్యం సేవించకుండా అతివేగంగా వెళ్లకుండా వాహనాలను నడపాలని కారు డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని పేర్కొనడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ మాట్లాడుతూ యువత వాహనాలు నడిపేటప్పుడు నెమ్మదిగా నడపాలని ఓవర్ టాక్ చేయరాదని మద్యానికి దూరంగా ఉండాలని తెలియజేయడం జరిగింది. మండల విద్యాధికారి హనుమంతు మాట్లాడుతూ యువతకు ఎంతో భవిష్యత్తు ఉంది. కనుక చెడువ్యసనాలకు బానిస కాకుండా, రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని మైనర్లు వాహనాలు నడపరాదని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎంఈఓ కళాశాల సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ఎస్సై హిమబిందు వారి సిబ్బంది, మీడియా బృందం పాల్గొనడం జరిగింది.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హిమబిందు

# రెడ్ క్రాస్ సొసైటీ సమావేశానికి హాజరైన గద్వాల సభ్యులు

**గద్వాల జనవరి 21, ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్య నిర్వహక వర్గ సమావేశానికి జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మెన్ సంగాల అయ్యపు రెడ్డి, సంఘం కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్య నిర్వాహక వర్గ సమావేశము బుధవారం నాడు హైదరాబాదులోని లోక్ భవన్ నందు రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గౌరవధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దాన కిషోర్,ఐఏఎస్. అనిత రామచంద్రన్, ఐఏఎస్, శృతి ఓజ, ఐఏఎస్,రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీరాములుతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల చైర్మన్లు , రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు హాజరు కావడం జరిగిందనీ చైర్మెన్ అయ్యపు రెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధజిల్లాల్లో ఏర్పాటుచేయదలచిన రక్తనిధి కేంద్రాలు,మాదకద్రవ్యాల నివారణకై సదస్సులు,వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను ఏర్పాటు,ప్రారంభం మొదలు విషయాలపై గవర్నర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు.ఈసమావేశంలోనే జోగులాంబ గద్వాల జిల్లాకు కేటాయించబడిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్,బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం లభించిందన్నారు.ఈ సమావేశానికి జోగులాంబ గద్వాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు జి రమేష్ హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానంతరము జిల్లా రెడ్ క్రాస్ కార్యక్రమాల నివేదికతో పాటు జోగులాంబ అమ్మవారి ప్రసాదము, చిత్రపటాన్ని గవర్నర్‌కు బహుకరించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జోగులాంబ అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మెన్,సభ్యులు

## టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్‌కు రాజీనామా

**అలంపూర్ జనవరి 21, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చెందిన తెలంగాణ రాష్ట్ర టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ పదవికి మహమ్మద్ ఇస్మాయిల్ రాజీనామా చేశారు.అలంపూరు పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి భర్త శంషాద్ ఇస్మాయిల్ తన పదవికి సంగారెడ్డి ఏజీఎం వీరభద్ర రావు కు బుధవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న ఇస్మాయిల్

## కిష్టాపూర్ పాఠశాలలో

# కర్తవ్య బోద్ దివాస్



పాఠశాలలో కర్తవ్య బోద్ దివాస్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ధన్వాడ, జనవరి 21 ప్రభాతవార్త :** ధన్వాడ మండల పరిధిలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో వివేక్ నేతాజీ జయంతోత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కర్తవ్యం దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రామచందర్ మాట్లాడుతూ విద్యార్థులు వివేకానంద నేతాజీ జీవితాలను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో ఉన్నతశిఖరాలకు ఎదగాలని కోరారు.జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంలో వారి జీవితం ఆదర్శంగా ముందుకుసాగాలని తెలిపారు.ఈకార్యక్రమంలో పాఠశాల తపస్ నాయకులు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తా

**ఉప్పునుంతల సర్పంచు శ్రీనివాసులు**




సన్మాన సభలో మాట్లాడుతున్న సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు

**ఉప్పునుంతల,జనవరి 21 ప్రభాతవార్త :** ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల బిసి కాలనీ తూర్పులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు,వార్డుసభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వెల్టూర్ పల్లె దవాఖానను

# సందర్శించిన వైద్యాధికారి




వెల్టూర్ పల్లె దవాఖానలో మందులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

**ఉప్పునుంతల, జనవరి 21 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూర్ పల్లె దావఖానను బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వైద్యాధికారి డా. అభిలాష్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖానాలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా పల్లె దవాఖానలో ఉన్న మందులను పరిశీలించారు. అనంతరం అధికారులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె దవాఖానను సందర్శించిన వైద్యాధికారి డా. అభిలాష్‌తో పాటు ఎంఎల్ హెచ్‌పి నవ్య, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, ఎఎన్‌ఎం జ్యోతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం

# అధ్యక్షుడిగా కావలి ఆకాష్



రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కావలి ఆకాష్

**గండీడ్ జనవరి 21, ప్రభాతవార్త :** గండిడ్ మండల రేషన్ డీలర్ల నూతన అధ్యక్షులుగా కావలి ఆకాష్ ఎన్నికయ్యారు. గండేడ్ మండలకేంద్రంలో బుధవారం డీలర్లసమావేశం నిర్వహించారు. డీలర్ల మెజారిటీ ప్రకారం మండల సంఘం అధ్యక్షునిగా కావలి ఆకాష్ ఎన్నికయ్యారు.ప్రధానకార్యదర్శిగా బావికాడి గోవిందమ్మ,ఉపాధ్యక్షునిగా మజిక వెంకటయ్య,కార్యదర్శిగా చర్లకోర్ల అమృతమ్మ,సలహాదారులుగా శకుంతల,ప్రవీణగోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

**దామరగిద్ద, జనవరి 21 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామంలో విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నరేష్ పొలం పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం పొలానికి వెళ్ళాడు. నాట్లు వేసే క్రమంలో వరి పొలంలో అంచులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన రైతుకు భార్య, కొడుకు ఉన్నారు. మృతుడి నరేష్ తండ్రి బుడ్డపోల నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు

## ప్రకృతి యోగ ప్రత్యేక వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి, యోగ ప్రత్యేక వైద్య శిబిరం రెండు రోజుల పాటు కొనసాగుతోంది. గురువారం ఈ శిబిరం చివరి రోజుగా నిర్వహించనున్నారు. కొణిజేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి యోగ కళాశాల, నేషనల్ ఆయుష్ మిషన్ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డా. రాధిక,డా. శ్రీలత వారి బృందం, ప్రకృతి–యోగ కళాశాల హౌస్ సర్జన్లు, యోగ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డా.సురేష్ నాయక్ ఆద్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా కొనసా గుతోంది. శిబిరంలో అన్నివయస్సుల వారికి వివిధ ఆరోగ్య సమస్యలను పరీక్షించి, ఉచితంగా ఆక్యుపంక్చర్, ఫిజియోథెరపీ,యోగా చికిత్సలు అందించడంతో పాటు అవసరమైన హెల్త్ మందులను పంపిణీ చేస్తున్నారు.ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై సద్వినియోగంచేసుకోవాలని నిర్వాహకులువిజ్ఞప్తి చేశారు.

## పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేస్తున్న దృశ్యం

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధి రేనివట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జి.గోవింద్ రూ.75 వేలవిలువైన సౌండ్ సిస్టంను అందజేశారు. గత గణతంత్ర దినోత్సవంలో ఇచ్చిన హామీని నెరవేర్చినట్లే ఇది జరిగింది. గ్రామ పెద్దలు పోలీస్ మహేందర్‌రెడ్డి 200 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు ఇవ్వనున్నారు. ప్రధానోపాధ్యా యులు రాజునాయక్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం పాఠశాల అభివృద్ధికి ఎంతో అవసర మని, ఇచ్చిన హామీలు నిలబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, బ్రహ్మయ్య, సాయికుమార్, రాజేష్ కృష్ణ, దేవమ్మ, గ్రామ పెద్దలు అశోక్‌గౌడ్, యాసీన్ పాల్గొన్నారు.

## వెల్టూర్‌లో సిఎం కప్ క్రీడలు ప్రారంభం



**ఉప్పునుంతల, జనవరి21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ వెల్టూరు క్లస్టర్ పరిధిలో క్రీడా విభాగంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ క్రీడల్లో స్థానిక సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ప్రారంభించారు. ఈ క్రీడల్లో యువకులు, యువజన సంఘం నాయకులు, వృధా కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ తదితర విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నట్లు క్లస్టర్ ఇంచార్జీ రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతోజు వెంకటేష్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు,వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు రవి శేఖర్, వెంకటయ్య, రాజేందర్‌రెడ్డి, తయ్యబ్ అలీ, గ్రామ యువకులు సమ్మద్,రాము, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వివేక్ నేతాజీ ప్రతిభ పరీక్ష



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న తపస్ నాయకులు, ఉపాధ్యాయులు

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండలంలో విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసి పోటీ భావనను పెంపొందించేందుకు వివేక్ నేతాజీ ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తపస్ ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు నరసింహ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బూనీడు, నిడ్జింత ఉన్నత పాఠశాలల్లో మండల అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తపస్ నాయకులు విద్యార్థుల పోటీదారీతనం, క్విజ్,ఉపన్యాస, వ్యాసరచన,ఇతర ప్రతిభా పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. మండల స్థాయిలో 71 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు.విజేతలను త్వరలోప్రకటించి బహుమతులుఅందజేయనున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,తపస్ నాయకులైన వరలక్ష్మి,మోహనరెడ్డి, శ్రీహరి,కిషోర్, ప్రశాంతి,శ్రీనివాస్, హనుమంతు,వేణుగోపాల్,కథలప్ప, అరెందర్‌రెడ్డి,ప్రియాంక, వెంకటయ్య,శృతి,సహనా హాజరయ్యారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ విజయకృష్ణ, గ్రామస్తులు

**లింగాల, జనవరి21 ప్రభాతవార్త:** రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సర్పంచ్ విజయ కృష్ణ అన్నారు. బుధవారం లింగాలమండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలోని రైతులు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పిఎం కిసాన్, భీమా సబ్సిడీ రుణాలు లబ్దిపొందలేరని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పాఠశాలకు హాజరు అయ్యే విధంగా చూడాలి



అప్పాయిపల్లి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ బషీర్ అహ్మద్

**లింగాల, జనవరి 21 ప్రభాతవార్త:** పాఠశాలకు రాని విద్యార్థులను వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠశాలకు హాజరు అయ్యే విధంగా చూడాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. బుధవారం లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి,ఎంసీ తాండ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు వంద శాతం నమోదయ్యే విధంగా చూడాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ టీచింగ్ డైరీ ప్రకారం విద్యాబోధన చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరవింద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

### రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : సీఐ కృష్ణయ్య



మాట్లాడుతున్న సిఐ కృష్ణయ్య , ఎస్సైలు

**వనపర్తి,జనవరి21 ప్రభాతవార్త:** వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకుంటారని పట్టణ సీఐ కృష్ణయ్య అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 వ తేదీ నుండి 27 వరకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర డిజి ఆదేశానుసారం,అరైవ్, అలైవ్ కార్యక్రమం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమన్నారు. ట్రాపిక్ నియమాలు పాటించడం చట్టపరమైన బాధ్యత అంతేకాక మనకుటుంబాల భద్రతకు సంబంధించిన అంశమన్నారు.రోడ్డుభద్రతను జీవనశైలిలో బాగం చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపకుండా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ తమ కుటుంబాలను, సమాజాన్ని సురక్షి తంగా ఉంచాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుండి తమ ప్రాణాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై హరిప్రసాద్, రూరల్‌ఎస్సై హృషికేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# విద్య వ్యవస్థ బలోపేతం కోసమే తనిఖీలు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందం అధికారులు

**లింగాల,జనవరి21 ప్రభాతవార్త:** విద్యా వ్యవస్థ బలోపేతం కోసమే విద్యాశాఖ పర్యవేక్షణ బృందం ద్వారా లింగాల మండలంలోని పలు పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించినట్లు పర్యవేక్షణ బృందం అధికారులు నాగరాజు,బృంగి కృష్ణప్రసాద్, ఈశ్వర్ అన్నారు. బుధవారం ఈ పర్యవేక్షణ బృందం కే.సి తాండ, రాయవరం, లింగాల సిపిఎస్ ప్రాథమిక పాఠశాలలో పర్యటించారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు,రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ,పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర విషయాలను క్షుణ్ణంగాపరిశీలించారు. ఈ పరిశీలనలో అగుపించిన లోపాలు,సవరణలు,సరిమైన సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ బృందం అధికారులు నాగరాజు,బృంగి కృష్ణప్రసాద్, ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థ పటిష్ట కోసం కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని కోరారు. లింగాల మండల కేంద్రంలో సిపిఎస్ ప్రాథమిక పాఠశాల పర్యవేక్షణలో ఉన్న బృందాన్ని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ కలిసి వారు తనిఖీ చేస్తున్న పరిశీలన అంశాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో విద్య వ్యవస్థపై ఏలాంటి పొరపాట్లు ఉన్న సూటిగా మండల ఉపాధ్యాయులకు అందించడమే పర్యవేక్షణ బృందాలఉద్దేశమన్నారు.పలు రకాలసలహాలు సూచనలు ఇస్తున్న జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి బషీర్ అహ్మద్, ప్రధానోపాధ్యాయురాలు కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదు

- రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి
- మద్యం సేవించి వాహనాలు నడపరాదు
- నర్వ ఎస్సై పబ్బతి రమేష్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై పబ్బతి రమేష్

**నర్వ, జనవరి21 ప్రభాతవార్త:** వాహనాలను మితిమీరిన వేగంతో నడపకుండా రోడ్డుభద్రత నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని నర్వ ఎస్సై పబ్బతి రమేష్ సూచించారు. ప్రమాదాలను నివారించాలని ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నర్వ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ప్రమాదాలను ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే ముఖ్య లక్ష్యంతో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కార్యక్రమంలో భాగంగా పది రోజులపాటు విస్తృతంగా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.గ్రామస్థాయిలో ప్రజలకు,ప్రభుత్వ ఉద్యోగులకు,విద్యార్థులకు వ్యాసరచన పోటీలు క్విజ్ పోటీలు,బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాద బాధితులు,వారి కుటుంబాలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగం,హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడం,ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడమేనని తెలిపారు.ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫుట్‌బాల్ విజేతలకు బహుమతులు అందజేత

**జిల్లెల మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఫుట్ బాల్ టోర్నమెంట్**
**ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి**



విజేతలతో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త :** మూడు రోజులుగా ఉత్కంఠ భరితంగా కొనసాగిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతలకు ప్లానింగ్‌బోర్డు వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి బహుమతులు అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో స్వర్గీయ డా. జిల్లెల మాధవరెడ్డి స్మారకార్థం నిర్వహించిన ఫుట్ బాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. టోర్నమెంట్ లో 12 జట్లు తడపడగా ఫైనల్ కు వనపర్తి వర్సెస్ ఏజీ హైదరాబాద్ జట్లు చేరాయి. హోరా హోరీగా జరిగిన ఫైనల్ పోరులో వనపర్తి జట్టుపై ఏజీ హైదరాబాద్ జట్టు 10 గోల్స్ తేడాతో విజయం సాధించింది. గెలిచిన ఏజి హైదరాబాద్ జట్టుకు రూ.50,000/ నగదు షీల్డ్, రన్నర్‌గా నిలిచిన వనపర్తి జట్టుకు రూ.30,000/ లు నగదు షీల్డ్, మూడవ ప్రైజ్ గ్లోబ్ హైదరాబాద్ జట్టుకు రూ.20,000లు నగదు షీల్డ్, నాలుగోవ ప్రైజ్ హుబ్లీ జట్టుకు రూ. 10,000/ లు నగదు షీల్డ్‌ను చిన్నారెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ ఆసియా ప్రాంతంలో క్రికెట్ ఆటకు ఎక్కువ ఆదరణ ఉన్నది కానీ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉన్న ఫుట్‌బాల్ ఆటను వనపర్తి జిల్లా నుంచి ఇండియా టీంకు ఆడాలనే ప్రయత్నంతో డా. జిల్లెల మాధవరెడ్డి స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరిగిందని అన్నారు.నా కొడుకులు ఆదిత్య రెడ్డి, అనురాగ్ రెడ్డికి ఫుట్‌బాల్ క్రీడ అంటే చాలా ఇష్టమని వారు టీవీలో ఎక్కువగా ఫుట్ బాల్ మ్యాచ్‌లను తిలకిస్తారని తెలిపారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన క్రీడాజట్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల క్రీడాకారులు, పిఈటిలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా కర్తవ్య బోధ్ దివాస్

- మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఎదగాలి
- ఉపాధ్యాయులు బాలకిష్టప్ప



కర్తవ్య బోధ్ దివస్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**న్రారాయణపేట, జనవరి 21 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో వివేకానందుడు, నేతాజీ జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కర్తవ్య బోధ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్నఉపాధ్యాయులు బాలకిష్టప్ప మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానందుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాలను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా, సమర్థంగా ఎదుర్కొనేందుకు మహనీయుల జీవితాలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. దేశం కోసం సాహసంతో జీవించి త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయ బృందం సభ్యులు తపస్ నాయక్, విజయ, మంగళ, లక్ష్మణ్, నర్సింలు, మధుసూదన్ రావు, నిర్మల, శశిరేఖ, ప్రతాప్, రఘు రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దూర్ మున్సిపాలిటీ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మద్దూరు, జనవరి 21 ప్రభాతవార్త:** మద్దూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ సన్నాహకాలను వేగవంతం చేసింది.మద్దూర్ పట్టణంలోని బీజేపీ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల వ్యూహాలు,వార్డుస్థాయి సమన్వయం, ప్రచార ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి మండల బీజేపీ అధ్యక్షుడు శంకర్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ దోకూరు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిపిరి వెంకటయ్య, జిల్లా ఎన్నికల కో–కన్వీనర్ మదన్, మండల ఎన్నికల కన్వీనర్ రాజు గౌడ్‌తో పాటు తలారి సాయిలు, భరత్, రఘుచారి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మొత్తం 16 వార్డులకు గాను 48 దరఖాస్తులు అందడం ప్రజల్లో బీజేపీపై పెరు గుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి వార్డులో బలమైన, ప్రజలకు చేరువైన అభ్యర్థులను నిలబెట్టి, ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకొని ఎన్నికల్లో బలంగా పోటీ చేస్తామని తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**శ్రీరంగాపూర్, జనవరి 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన చిన్న నరసింహ, నాగమ్మ ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులను శ్రీరంగాపూర్ మండల సర్పంచ్ మద్దిలేటి, టిపిసిసి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి,రాజేంద్రప్రసాద్‌యాదవ్, వార్డు మెంబర్ రాజ్యలక్ష్మి సురేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, రాముడు యాదవ్,జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ పురుషోత్తం,కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, తౌఫిక్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్‌కు సన్మానం



మండల ఉపసర్పంచ్ కళ్యాణ్ ఖాజాను సన్మానిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, జనవరి21 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల ఉపసర్పంచ్ కళ్యాణ్ ఖాజాను ఆరెకటికే అభివృద్ధి సంఘం అధ్యక్షులు భూపాల్, అశోక్ దాదా ఆధ్వర్యంలో హైదరాబాదులో అరెకటిక ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఆర్.కృష్ణయ్య, ప్రొ॥ కోదండరాంసన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కులాలు అన్ని ఏకమైతే 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోగలమని పేర్కొనడం జరిగింది. నూతనంగా గెలుపొందిన కాజా లాంటి రాజకీయ నాయకులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని అన్నారు. ప్రొ॥ కోదండరాం మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే సమాన హక్కులు కలుగుతాయి అన్నారు. ఆరె కటిక కులం నుండి వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్‌గా నియమితులైన కళ్యాణ్ ఖాజాను అభినందించారు. ప్రతి ఒక్కరూ రాజకీయంగా చైతన్యం కావాలని అన్నారు.ఖాజా మాట్లాడుతూ వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్‌గా ఎన్నికైనందుకు తనను శాలువతో సన్మానించి అభినందనలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రాజకీయంగా భవిష్యత్తులో ముందుకు వెళ్లడానికి అందరి ఆదరణ ఆప్యాయత దీవెనలు తనకు ఉండాలని కోరుకుంటూ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## హైమాస్టు లైట్లను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే



హైమాస్టు లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,జనవరి 21 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీలో హైమాస్టు లైట్లను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైమాస్టు లైట్లు ప్రజలకు మెరుగైన లైటింగ్ సౌకర్యాలను అందిస్తాయన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి,ఫరూక్ అలీ, అంజన్ కుమార్‌రెడ్డి, కొండ గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంపండు, ఉమ్మి గారి వెంకటేష్, శంకర్, జమీల్ ,గౌనిరాము, శేఖర్ రామాంజనేయులు, మున్సిపాలిటీ ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన రాయికోడ్ ఉపసర్పంచ్, గ్రామ నాయకులు



ఎస్సైని కలిసిన ఉపసర్పంచ్, గ్రామ నాయకులు

**నర్వ, జనవరి 21 ప్రభాతవార్త:** రాయికోడ్ గ్రామ ఉపసర్పంచ్ గా ఎన్నికైన మ్యాతరి గోపాల్ బుధవారం నర్వ ఎస్సై పబ్బతి రమేష్‌ను మర్యాద పూర్వకం గా కలిశారు.ఈ సంధర్భంగా ఎస్సైకి స్వీట్‌ను అందించారు. ప్రభుత్వం ఈనెల 13 నుండి 26 వరకు నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రాయికోడ్ గ్రాంలో ప్రోగ్రాం నిర్వహించి అవగాహన కల్పించాలని ఎస్సై దృష్టికి తీసుకురావడంతో ఎస్సై రాయికోడ్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు.ఎస్సైని కలిసిన వారిలో నారా వెంకటేష్, మల్లన్ కోటి శంకర్,నౌసు వెంకటయ్య, పుంజరి ఖాసీం తదితరులు ఉన్నారు.

## కొట్టం ఇండస్ట్రీస్‌లో తనిఖీలు

**వనపర్తి, జనవరి21 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి శివారులో ఉన్న కొట్టం ఇండస్ట్రీస్‌లో మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పంచనామా నిర్వహించిన సంగతి విదితమే. ప్రభుత్వం నుండి సంబంధిత రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం 2022, 23 రబీ సీజన్, 2024, 25 ఖరీఫ్ సీజన్ వరకు 8619.42 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయింపులు జరిగాయి.సివిల్ సప్లై అధికారులు మిల్లులో తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వం కేటాయించిన ధాన్యం లో గణనీయంగా వ్యత్యాసాలు ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాల కొరకు జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్‌ను వివరణ కోరగా ధాన్యంలో వ్యత్యాసం ఉందని దీనిపై పూర్తి విచారణ జరుగుతున్నట్లు తెలిపారు.



రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లై అధికారులు (ఫైల్)

## ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి భాగం**

బ్లాక్ స్పాట్లను ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నాం. ప్రమాదాలకు కారణమ య్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. ప్రమాద ప్రాంతాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని. ప్రతి ఒక్కరూ అరైవ్ అలైవ్ లక్ష్యాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని అధికారులు కోరారు. సమాజంలో భద్రతా సంస్కృతిని పెంపొందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ, వనపర్తి ఆర్టీఓ సైదులు, కొత్తకోట ఎస్సై ఆనంద్, పెద్దమందడి ఎస్సై జలంధర్‌రెడ్డి, పెబ్బేర్ ఎస్సై యుగంధర్‌రెడ్డి, అలంపూర్ టోల్ ప్లాజా ప్రాజెక్టు అధికారి ప్రసాద్‌రావు, మేనేజర్ బాలచందర్, అడ్డాకల్ టోల్ ప్లాజ మేనేజర్లు కార్తికేయన్, కిషోర్ రెడ్డి, రఘునందన్ గౌడు, నేషనల్ హైవే అథారిటీఆఫ్ఇండియాఅధికారులు, రోడ్డురవాణాశాఖఅధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతా..

**మొదటి పేజీ తరువాయి భాగం**

రుణమాఫీ అందజేస్తామని ఆయన చేనేత కార్మికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 10 ఏళ్ల పాలనలో మున్సి పాలిటీలలో అభివృద్ధి పనులు జరగలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. అలాగే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ ఏఈ చంద్రశేఖర్, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు, లక్ష్మీకాంతరెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, తౌఫిక్, ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్‌గౌడ్, హరీష్ నాయక్, మార్కెట్ డైరెక్టర్లు, శ్యాంకుమార్, కమలాకర్‌గౌడ్, విష్ణు, దేవరకొండ మోహన్, టిరాజు, హనుమంతునాయక్, బాల్రాజ్, కడియాలయాదగిరి, తోఫిక్, పాషా, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు రహదారి భద్రతపై ప్రజలకు ఆదర్శంగా నిలవాలి

**మొదటి పేజీ తరువాయి భాగం**

క్షతగాత్రులకు సరైన సమయంలోచికిత్స అందించడం వైద్య శాఖ అధికారుల బాధ్యత అనిగుర్తు చేశారు. విద్యాశాఖ అధికారులు కూడా పాఠశాల బస్సులు సరైన కండిషన్లో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ఫలితంగా విద్యార్థులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చన్నారు. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా రవాణా శాఖ, ఇతర అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పౌరులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు వారికి ఆ వాహనాలను సరిగ్గా నడపడం వస్తుందో, లేదో పరిశీలించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో, తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపడం వలన ప్రమాదాలను చాలావరకు తగ్గించవచ్చని ఎస్పీపేర్కొన్నారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాల నివారణపై ముద్రించిన పోస్టర్లను అతిథులు విడుదల చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి అతిథులు రోడ్డుభద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పి శంకర్, ఆర్డీవో అలివేలు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన కానుకుర్తి గ్రామ ఉపసర్పంచ్



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు

**దామరగిద్ద, జనవరి 21 ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు గాను ఆకర్షితులై ప్రతి పేదవాడికి కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని భావించి బుధవారం మాజీ డిసిసి కుంభం శివ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కానుకుర్తి గ్రామ ఉపసర్పంచ్ బోర్ర యశోదమ్మతో పాటు పలువురు వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## మహిళా సర్పంచులు స్వతంత్రంగా పని చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం**

పేదలు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, పిల్లల సంక్షే మానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గ్రామాభి వృద్ధిలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సర్పంచులకు సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, హరిత హారం అంశాలతో పాటు ఉపాధి హామీ పథకం కింద పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామ సంఘాల భవనాలు (విఓ భవనాలు), అంగన్‌వా డీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, ప్రాథమిక పాఠశాల ల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు గ్రామంలోని ప్రతి పిల్లవాడినిప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత సర్పంచులదేనని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో సమన్వ యంతో పనిచేసి ప్రభుత్వ విధానాలు, నిబంధన లను కచ్చితంగా పాటించాలని, గ్రామ సభ అనుమతి లేకుండా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకూడదని కలెక్టర్ హెచ్చరించారు. మహిళా సర్పంచులు ధైర్యంగా, స్వతంత్రంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి నాయకత్వంవహించాలని, బడ్జెట్ కేటాయింపులు సక్రమంగా చేసి ఆదాయం–వ్యయాల మధ్య సమతుల్యత పాటించాలని సూచించారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకట రెడ్డి, ట్రైనీ డిపిఓ నిఖిల, డిఎల్‌పిఓ రామ్ మోహన్, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ

**నారాయణ పేట, జనవరి 21 ప్రభాతవార్త:** రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సురక్షితంగా గమ్యానికి చేరుదాం. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 10 రోజుల పాటు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక సెల్ నంబర్‌ను త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. జిల్లాలో నాలుగు బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. 2024లో 106 మంది, 2025లో 99మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని తెలిపారు. ఈ సంవత్సరంప్రమాదాలను మరింత తగ్గించేందుకు తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు ముమ్మరంచేస్తామని అన్నారు. పోలీసులతో పాటు ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే ప్రమాదాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు.

# గ్రామసభను బహిష్కరించిన గ్రామస్తులు

**నారాయణపేట, జనవరి 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద ఊట్కూర్ పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మారుస్తున్న నేపథ్యంలో ఊట్కూర్ గ్రామానికి ముంపు ముప్పు తీవ్రతరం అవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ ఏర్పాటు చేయకముందే ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని గత కొన్ని నెలలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకులు ఆరోపించారు. మూడు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించినా ఇప్పటివరకు స్పష్టమైన స్పందన లేదని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరినా ఆ దిశగా చర్యలు కనిపించట్లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో బుధవారం ఊట్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పునరావాసం–పునరాశ్రయం గ్రామసభను గ్రామస్తులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ బహిష్కరించారు. ఇప్పటికే చెరువు ప్రస్తుత సామర్థ్యంతోనే గ్రామంలోని పలు ఇళ్ల పునాదుల్లో నీటి ఊట కొనసాగుతోందని, భవిష్యత్తులో రిజర్వాయర్‌గా మారితే గ్రామానికి తీరని నష్టం వాటిల్లుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే బుధవారం నిర్వహించిన గ్రామసభపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గ్రామ ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గ్రామసభ నిర్వహించడం సరికాదని మాజీ సర్పంచ్ భాస్కర్, ఆర్డీవో రామచంద్ర నాయక్‌ను ప్రశ్నించారు. గ్రామస్తులు మాట్లాడుతూ చెరువు కింద ఉన్న ఓం నగర్, శివాజీ నగర్, దేవినగర్, పెద్ద పీర్లగడ్డ, ఈశ్వర్ మందిర్ ప్రాంతాలు ఇప్పటికే నీటి ఊట ప్రభావానికి లోనవుతున్నాయని తెలిపారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం సరేనని, కానీ నివాస ప్రాంతాల్లో



గ్రామసభను బహిష్కరిస్తున్న గ్రామస్తులు

ఊటతో ప్రభావితమవుతున్న వారిని నిర్వాసితులుగా గుర్తించకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిఊట ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఊట్కూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా అధికారికంగా ప్రకటించాలని, ప్రభావిత ప్రజలను నిర్వాసితులుగా గుర్తించి తగిన నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుపై సమగ్ర ప్రభావ అంచనా నిర్వహించి గ్రామ భవితవ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చింత రవి, ఉప సర్పంచ్‌రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్, బిజెపి నాయకులు కృష్ణయ్య గౌడ్, రమేష్, బీఆర్ఎస్ నాయకులు కోరం శివారెడ్డి, ఆనంద్ రెడ్డి, తరుణ్ రెడ్డి, విబాధూర్ రహేమాన్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- 36 మంది ఆక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు సన్మానం
- విద్యార్థులకు బహుమతులు అందజేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా ప్రతి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సంబంధించి మహబూబ్ నగర్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన నెలరోజుల అవగాహన కార్యక్రమాల ముగింపు సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ మాసోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం, అతివేగాన్ని నివారించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని సూచించారు. ఈ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 36 మంది ఆక్సిడెంట్ ఫ్రీ ఆర్‌టిసి డ్రైవర్లను కలెక్టర్ సన్మానించారు. పిల్లలకు రోడ్డు భద్రత అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి పురస్కారాలు అందించారు. నెలరోజుల పాటు రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్, ఆర్టీసీ అధికారులు కలిసి



డ్రైవర్లను సన్మానిస్తున్న కలెక్టర్

చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలు, శిక్షణ కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు విజయవంతంగా సాగాయని అన్నారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో చురుకుగా పాల్గొని సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రత్నం, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్, ఆర్ టిఓ రఘు కుమార్, ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, రవాణా శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల అభివృద్ధి కోసం కృషి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల, జనవరి 21, ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని బీ.టి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు విస్తీర్ణం వివిధ అభివృద్ధి పనుల కోసం 18.70 కోట్ల రూపాయల నిధుల పనులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని రెండవ రైల్వే గేట్ ఓలివా చర్చి ముందు డ్రైనేజీ వ్యవస్థ, బి ఆర్ అంబేద్కర్ చౌక్ లో డ్రైనేజ్, బీటీ రోడ్డు నిర్మాణానమ్, ఐ డి ఎస్ ఎం టి కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణానమ్, ఈచింతల పేట మెయిన్ రోడ్డు విస్తీర్ణం ప్రధాన రహదారి వెడల్పు భూమి పూజ చేసి ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా గద్వాల పట్టణ అభివృద్ధి కోసం 18.70 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగినదనీ, దీనితో గద్వాల పట్టణంలోని ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రధాన రహదారిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనదారులకు వ్యాపారస్తులకు ఇలాంటి ఇబ్బంది కలవకుండా ఉండాలని ప్రభుత్వం దూర దృష్టితో ఆలోచించి ప్రధాన రహదారులను రోడ్డు నిర్మాణంలోకు ప్రత్యేక నిధులను కేటాయించడం జరిగింది త్వరలోనే రోడ్డు నిర్మాణం పనులను పూర్తిచేసి ప్రజల్లోకి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు



భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

సూచించారు. అదేవిధంగా భవిష్యత్తులో గద్వాల పట్టణం మరింత అభివృద్ధి చేసుకునే విధంగా నా వంతు సహాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్‌గౌడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, జి.వేణుగోపాల మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబర్ మాజీ కౌన్సిలర్స్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సదరం శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులకు

# అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, జనవరి 21 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం అప్పక్‌పల్లి వద్ద గల జిల్లా ఆస్పత్రిలో బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ యూడీఐడీ సదరం ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ, దివ్యాంగులకు సకాలంలో యూడీఐడీ సర్టిఫికెట్లు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సదరం శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జిల్లాలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో ఈ నెల23న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్, ఎంపీడీవోలు ప్రతి నెలా మీసేవా నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న దివ్యాంగులు తప్పకుండా సదరం శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి యూడీఐడీపై



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఓ మొగులప్ప, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆదిత్య, డీపీఓ సుధాకర్ రెడ్డి, డీపీఎం జయన్న, వైద్యులు, సదరం సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ జిల్లా ఆస్పత్రిలోని క్యాన్సర్ విభాగం, ఐసీయూ విభాగం, మెడికల్ స్టోర్, స్కానింగ్ విభాగంతో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు.

## పులుల లెక్క.. పక్కా..

**మొదటి పేజీ తరువాయి భాగం**

అన్వేషించవచ్చు. మరో నాలుగు పాటు గణన నిర్వహిస్తామని డిఎఫ్ఓ రేవంత్ చంద్ర పేర్కొన్నారు.

**ఇవి ప్రత్యేకతలు :** 16 కి.మీ. ఫర్హాబాద్ సఫారి (..3,000/ వాహనం 7 సీట్లు లేదా వ్యక్తికి రూ.430), లోతైన అడవి 35 కి.మీ గుండం సఫారీ (రూ.5,000/ వాహనం7 సీట్లు లేదా ఒక్కో వ్యక్తికి రూ.71 ), 1 రూ. కేవ్స్ సఫారి (..3,000/ వాహనం 5 సీట్లు లేదా వ్యక్తికి 600 రూపాయలు). త్వరలో ప్రారంభించేందుకు కొత్త 20 కిమీ కొల్లం సఫారీ మార్గం కూడా అధికారులు సిద్ధం చేశారు. ఏ టి ఆర్ వద్ద పర్యాటక నమూనా సామాజిక సంక్షేమంతో లోతుగా కలిసిపోయింది. 18 సఫారీ వాహనాల సముదాయాన్ని పూర్తిగా స్థానికచెంచు తెగ వారు నడుపుతున్నారు. కమ్యూనిటీ సభ్యులు స్వదేశీ దృక్పథాన్ని అందించడానికి డ్రైవర్లుగా, ప్రకృతి మార్గదర్శకులుగా శిక్షణ పొందారు.

**చెంచులకు ఉపాధి:** ఏ.టి.ఆర్ భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సుస్థిర మౌలిక సదుపాయాలు, అవసరమైన సౌకర్యాలకు అధికార యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తుంది. ప్రవేశ ద్వారం సౌకర్యాల సమగ్ర పునరుద్ధరణ, ఫర్హాబాద్ వ్యూ పాయింట్, గుండం వద్ద బయో టాయిలెట్ల ఏర్పాటుతో పాటు దుర్వాసల చెక్ పోస్ట్ వద్ద కొత్త టాయిలెట్ సౌకర్యం, ఫర్హాబాద్ ఎంట్రీ, దోమలపెంట యాక్టివ్ ప్లానింగ్ తో కూడిన యాక్టివ్ ప్లానింగ్ పాదముద్ర, ప్రధాన రవాణా ప్రదేశాలలో పర్యాటకుల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాల విస్తరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవసరాన్ని తగ్గించడం. పెరుగుతున్న మాంసాహారం వేటాడే జనాభాకు మద్దతుగా, ఏటిఆర్ పటిష్టమైన నీటి నిర్వహణ వ్యవస్థను అమలు చేసింది. సౌరశక్తితో నడిచే బోర్‌వెల్, రిజర్వ్ లోపల లోతుగా నీటి రంధ్రాలను నిర్వహించడం ద్వారాజంతువులకు ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా చేశారు. సఫారీ రుసుము నుండి వచ్చే ఆదాయం పారదర్శకంగా నేరుగా టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్‌లోకి పంపబడుతుంది. ఇది వారి జీతాలు, టైగర్ రిజర్వ్ అభివృద్ధికి ఉపయోగించ



వాలంటీర్లు, చెంచులు, అధికారులు

బడుతుంది. ఆర్థిక సమగ్రతను మరింతగా నిర్ధారించడానికి, చెక్‌పోస్ట్ విధులు ఆదాయ లీకేజీలను తొలగించడానికి డిజిటల్ జోక్యాలతో క్రమబద్ధీకరించారు. పర్యాటకులు ఖర్చు చేసేప్రతి రూపాయి అటవీ, వన్యప్రాణులు, దాని ప్రజలకు మద్దతునిస్తుంది. అన్ని సఫారీ కార్యకలాపాలు చెంచు తెగకుచెందిన శిక్షణ పొందినసభ్యులచే నిర్వహించబడతాయి. ఆదాయం పారదర్శకంగా సమాజ జీవనోపాధి పరిరక్షణకు మద్దతు ఇస్తుంది.

**25 వరకు సఫారీకి బ్రేక్..**

ప్రస్తుతం కొనసాగుతున్న " ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026" కారణంగా సఫారీ కార్యకలాపాలు జనవరి 20 నుండి జనవరి 25 వరకు మూసివేయబడతాయి. ఈ భారీ కసరత్తులో ప్రస్తుతం 139మంది సాధారణ అటవీ సిబ్బంది, 150 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, 170 మంది అంకితభావంతో కూడిన వాలంటీర్లు, 253మంది వైల్డ్ లైఫ్ జనాభాలో పని చేస్తున్నారని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్, అటవీ సంరక్షణాధికారి శివాని డోగ్రా తెలిపారు. ఇదిలా ఉండగా గత ఏడాది వన్యప్రాణి లెక్కల్లో 36 పెద్ద పులులు 2 పులి కూనలు నమోదు కాగా వందల సంఖ్యలో చిరుతపులులు, ఎలుగుబంట్లు, వేల సంఖ్యలో జింకలు ఉన్నట్లు గుర్తించారు. మరో నాలుగు రోజుల్లో అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ లో వన్యప్రాణుల లెక్కతో పాటు పెద్ద పులుల సంఖ్య కూడా తేలనున్నది.

## దేవాలయంలో మెరుగైన వసతులు కల్పిస్తాం

**మొదటి పేజీ తరువాయి భాగం**

మౌలిక వసతులు, ప్రజా సదుపాయాలు, విద్య ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. ప్రజల సహకారం, ఆశీస్సులు ఎప్పటికీ తనకు అండగా ఉంటే, మరింత నిబద్ధతతో, నిజాయితీగా ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు లభిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌ను హైదరాబాద్, వరంగల్ తర్వాత అద్భుతమైన మహానగరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన సంకల్పమని ఆయన తెలిపారు. అంతకుముందు ఆయన ఆంజనేయస్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముడా ఛైర్మన్‌లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీతో పాటు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న, నాయకులు సిజే బెనహర్, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ప్రవీణ్ కుమార్ , దాసరి సామ్యేల్, రాజు, శ్యాం, శ్రీను, సతీష్ , ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## విధులపై డీఈఓ నిర్లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి భాగం**

జీతం రావడం లేదు. అయినా కూడా పార్ట్‌టైమ్ విధానంలో సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు ఆఫీస్ లో ఫైల్స్ క్లియర్ చేసే పని మాత్రమే జరుగుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్స్ కు మద్దతు, ప్రభుత్వ పాఠశాలలను పక్కన పెట్టే ధోరణి పెరిగిందన్నారు. "ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్" పేరుతో సీబీఎస్సీ నర్సరీ 8వ తరగతి ద్వారకాపురి కాలనీ (పిస్తా హౌస్ దగ్గర), మహబూబ్‌నగర్‌లో ఏ ప్రభుత్వ అనుమతులు లేకుండాప్రచారం, కరపత్రాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్నా, డీఈవో, ఎంఈఓ పూర్తిగా మౌనంగా ఉండి స్పందించలేదని, లంచాల వ్యవహారాల్లో నిమగ్నంఅయ్యారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డిఈఓపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడి సోమిరెడ్డి సార్‌ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎఫ్ఐ స్టేట్ మెంబర్ నరహరి, గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సెక్రటరీ భరత్, పిడిఎస్‌యు అధ్యక్షులు సీతారాం, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలి

**మొదటి పేజీ తరువాయి భాగం**

సమస్యలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, పైప్‌లైన్‌ల పనితీరు తదితర అంశాలను గుర్తించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ జల్ సేవా ఆంకలన్ పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీ తాగునీటి సరఫరాకు సంబంధించిన గ్రామాల వారీ వివరాలను తప్పనిసరిగా ఫిబ్రవరి చివరిలోగా 100 శాతం అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా గ్రామ నీటి–పారిశుద్ధ్య కమిటీలు (జల్ పాణి సమితులు) ఏర్పాటు చేయాలని, జనవరి 26లోపు గ్రామసభలు నిర్వహించి ఆమోదంపొందిన అనంతరం ఫిబ్రవరి చివరి నాటికి పంచాయతీ కార్యదర్శులు జల్ సేవా ఆంకలన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనంగా, ప్రతి మండలంలో ఎంపిడిఓ, మండల ఏఈ, ఇన్‌చార్జ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లతో మండల స్థాయి బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల వారీగా, మండలాల వారీగా నీటి అవసరాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టి వేసవి ప్రారంభానికి ముందుఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డి, ఎంపిడిఓలు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

- ఇద్దరికి జరిమాన
- సీఐ కమలాకర్ వెల్లడి

**జడ్చర్ల, జనవరి 21 ప్రభాతవార్త :** జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అధిక మద్యం సేవించి వాహనాలు నడుపుచు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను బుధవారం సెకండ్ క్లాస్ కోర్టు జడ్చర్ల ముందు హాజరుపరిచారు. జడ్జి ఆర్. శశిధర్ వారికి వచ్చిన ఆల్కహాల్ బిఎసి లెవెల్ ఆధారంగా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించారు. ఇందులో ఇద్దరూ కుంభా కేశవులు తండ్రి చిన్న వెంకటయ్య (38), నాగసాల గ్రామము, జడ్చర్ల మండలం మండలం ఇతనికి బిఎసి లెవెల్ 550ఎంజి వచ్చింది. ఇతని కి రెండు రోజులు రోజుల జైలు శిక్ష, రూ. 5000లు జరిమానా విధించారు. అదేవిధంగా రామాంజనేయులు అలియాస్ అంజయ్య తండ్రి రాములు ( 34) రాజీవ్ నగర్ కావేరమ్మ పేట జడ్చర్ల టౌన్ అను వ్యక్తికి పట్టుబడినప్పుడు బిఎసి లేవల్ 283 ఎంజి వచ్చింది. ఇతనికి కూడా జడ్జి రూ.3000 జరిమానాతో పాటు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు జడ్చర్ల సిఐ కమలాకర్ తెలిపారు.